విశాఖపట్టణం
ఆదివారం 25 జనవరి 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 2 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో

## భారీ అగ్నిప్రమాదం

3




ఇండిగోకు 700కి పైగా

## స్లాట్‌లు కట్

**శీతాకాలపు విమానాలు తగ్గించుకోవాలని ఆదేశం**

**షెడ్యూల్‌లో 10 శాతం కోత**

**కొరడా ఝుళిపించిన డీజీసీఏ**

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, దేశీయ విమానాశ్రయాలలో 700కి పైగా స్లాట్‌లను వదులుకుంది. భారత విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ కఠినమైన చర్య తరువాత, ఎయిర్‌లైన్ తన శీతాకాలపు విమానాలను తగ్గించుకోవాలని ఆదేశించింది. గత సంవత్సరం డిసెంబర్ ప్రారంభంలో సంభవించిన భారీ అంతరాయం తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. పొగమంచు, ఇతర కారకాలు గణనీయమైన విమాన ఆలస్యాలకు కారణమయ్యాయి. ప్రయాణీకులు విమానాశ్రయాలలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వేలాది విమానాలు రద్దు అయ్యాయి. డిసెంబర్ 3 - 5 మధ్య, ..మిగతా 2లో

# స్వచ్ఛత మన బాధ్యత


**పరిశుభ్రత జీవన విధానం కావాలి**

**ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లు**

**కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ**

**నగరిలో స్వర్ణాంధ్రా - స్వచ్ఛాంధ్రకు శ్రీకారం**






(చిత్తూరు - జయజయహే)

రాష్ట్రంలో పరిశుభ్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, ప్రజలందరి జీవన విధానంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి చివరి శ్వాస వరకు ప్రాంతాభివృద్ధి కోసం పని చేసిన వ్యక్తి ముద్దుకృష్ణమ అని గుర్తుచేసుకున్నారు. ప్రతీ నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పేదల సేవలో వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛత కోసం రూ.573 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రూ.510 కోట్లతో 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం పట్టణాల్లో లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పేరుకుపోయేలా వదిలేసిందని, దానివల్ల భూగర్భ జలాలు, వాయు కాలుష్యం పెరిగిందని విమర్శించారు. ప్రస్తుతం 112 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను పూర్తిగా తొలగించి, వంద శాతం చెత్త సేకరణే లక్ష్యంగా ..మిగతా 2లో

# జనసేన లోకల్ ఫోకస్




**స్థానిక ఎన్నికలపై పవన్ గురి**

**పార్టీ ఆవిర్భావం నాటికి కమిటీలు పూర్తి**

**క్షేత్రస్థాయిలో సత్తా చాటాలని వ్యూహం**

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 21 అసెంబ్లీ, ఇద్దరు ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలు, ముగ్గురు మంత్రులు, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో బలంగా ఉన్న పార్టీని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయాలని ఫిక్స్ అయిపోయారు. కూటమిలో భాగస్వామ్యంగా ఉంటూనే సొంతంగా బలపడేందుకు వ్యూహ రచన చేస్తున్నారు. అధికారం, విపక్షం అన్న తేడా లేకుండా.. రోల్ ఏదైనా పది కాలాల పాటు పార్టీ నిలబడాలని కలలు కంటున్నారు పవన్. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పటిష్టతపై ఫోకస్ పెట్టి..పార్టీ కమిటీలు నియామక ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. మార్చి 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం నాటికి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టారు. పార్టీలో జరుగుతున్న కొన్ని అంతర్గత సంఘటనలపైనా పవన్ ..మిగతా 2లో



# టీడీపీలో కోవర్టుల రచ్చ

**వైసీపీ నుంచి కోవర్టులు టీడీపీలో చేరారన్న చింతమనేని**

**అధినాయకుడు నిర్ణయమే ఫైనల్ అన్న పార్థసారథి**

**ఇద్దరి మధ్య మాటల తూటాలు**

(ఏలూరు - జయజయహే)

ఏలూరులో మంత్రి పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యేల చింతరమనేని ప్రభాకర్ మధ్య మాట తూటాలు పేలాయి. ఏలూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ఇద్దరు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు నేరుగానే విమర్శలు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన ..మిగతా 2లో

# యధేచ్ఛగా భూ దోపిడీ


**గీతం భరత్ 54 ఎకరాలు కబ్జా**

**రూ. 5 వేల కోట్ల భూమి హాం ఫట్**

**భరత్ పై భూ ఆక్రమణ కేసు పెట్టాలి**


**భూ కేటాయింపుపై వైసీపీ పోరాటం**

**మాజీ మంత్రి గుడివాడ అమర్ మండిపాటు**



| | | | |
|---|---|---|---|
| | తయారుచేసిన అంచనాలకు పరిపాలనా పరమైన ఆమోదము కొరకు కౌన్సిల్ వారికి సమర్పించడమైనది. (అంచనా వ్యయం: 1,25,00,000/-) ఆర్.సి.నెం. 475/2025-26/ఇ.ఇ – II | | |
| 14 | మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ – జోన్ – II – ఇంజనీరింగ్ – వార్డు నెం. 6 – "జోన్ – II లోని సాయి ప్రియ లేఔట్ కు బక్కన్నపాలెం గ్రామం సి.సి రోడ్ & కాలువలు నిర్మాణం" – పరిపాలన పరమైన ఆమోదం మరియు టెండర్లు పిలుచుటకు గాను అనుమతులు కొరకు సమర్పించడమైనది. (అంచనా వ్యయం: 76,60,000/-) ఆర్.సి.నెం. 420/2025-26/ఇ.ఇ – II | ఇంజనీరింగ్ జోన్ – II | |
| 15 | మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ – మధురవాడ జోన్ – టౌన్ ప్లానింగ్ విభాగం – విశాఖపట్నం రూరల్ మండలం తహసీల్దార్ వారు – ఎండాడ గ్రామం మరియు రుషికొండ గ్రామాలలో గల ప్రభుత్వ భూమి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 54.79 సెంట్లు గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (GITAM) విశ్వవిద్యాలయం తరపున క్రమబద్ధీకరణ (Regularization) మరియు బదలాయింపు (Alienation) ప్రతిపాదనలకు సంబంధించి GVMC కౌన్సిల్ తీర్మానం (Resolution) కొరకు – సమర్పించుట – గురించి. ఆర్.సి.నెం.1992/026/ఎసిపి-II/జి2 | టౌన్ ప్లానింగ్ మధురవాడ జోన్ | |

2



# ప్రసాదం బుట్టల్లో ఎలుకలు

**రాష్ట్ర ప్రభుత్వం సీరియస్**

**ఇద్దరు అన్నవరం దేవస్థాన ఉద్యోగులపై వేటు**

(అన్నవరం - జయజయహే)

అన్నవరం ప్రసాదం ఉంచిన బుట్టలపై ఎలుకలు తిరుగుతున్న ఓ వీడియో వైరల్ అవుతోంది. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్న వేళ అధికారులు స్పందించారు. దీనికి కారణమైన అధికారులను సస్పెండ్ చేశారు. అన్నవరం ప్రసాదం చాలా పవిత్రమైంది. చిటికెడు దొరికితే చాలు అది మహా అద్భుతమని కళ్లకు అద్దుకుని తినే వాళ్లు కోట్ల మంది ఉన్నారు. కానీ అలాంటి ప్రసాదం తయారీ, పంపిణీలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. విషయం వెలుగులోకి వచ్చినప్పటికీ సరి చేసుకోకపోగా భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తోంది. ఇప్పుడు జరిగింది కూడా అదే.

ఇప్పుడు వైరల్ అవుతున్న వీడియోలో అన్నవరం ప్రసాదం ఉన్న బుట్టల్లో ఎలుకలు తిరుగుతన్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. కళ్లకు కట్టినట్టు తప్పు కనిపిస్తున్నా దాన్ని పట్టించుకోకుండా భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలానే ..మిగతా 2లో



# 27న అఖిలపక్షం

**బడ్జెట్ సమావేశాలపై చర్చ**

**28 నుంచి పార్లమెంట్ సమావేశాలు**

**కేంద్ర ప్రభుత్వం కసరత్తు**

2

For a pure tomorrow.. జయహో

# స్వచ్ఛత మన బాధ్యత





మొదటి పేజీ తరువాయి...

గ్రామీణ ప్రాంతాల్లో ఇ-ఆటోలు, ట్రై సైకిళ్లను అందుబాటులోకి తెచ్చామని, వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేసే యూనిట్లను కూడా విస్తరిస్తున్నామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి చూపిస్తోందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఆడపడుచుల సంక్షేమం కోసం స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా ఏడాదికి రూ.33 వేల కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తూ పేదల ఆర్థిక భద్రతకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. పాఠశాల విద్యార్థుల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేందుకు ముస్తాబు అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ఆయన వివరించారు. నేరగాళ్ల రాజకీయాలు చేయడం వల్ల గతంలో రాష్ట్ర భవిష్యత్తు దెబ్బతిన్నదని, ఇప్పుడు మళ్లీ పరిశుభ్రమైన, కాలుష్య రహితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్లాస్టిక్ , ఇ-వేస్ట్ సేకరణ కోసం 130 స్వచ్ఛ రథాలను ఇప్పటికే ఏర్పాటు చేశామని, 2026 మార్చి నాటికి వీటి సంఖ్యను 660కి పెంచుతామని వెల్లడించారు. ఇల్లు మాత్రమే కాదు, మన పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వర్ణాంధ్రను సాకారం చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



## ఎలుకలు

ఉంటుందని తింటే తినండి లేకుంటే వెళ్లిపోండని మండిపడ్డారు. ఇవన్నీ కూడా వీడియోలో రికార్డు అయ్యాయి.

ఈ మొత్తం వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జరిగిన తప్పిదాన్ని గ్రహించిన అన్నవరం దేవస్థాన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. భక్తుల మనోభావాలను పట్టించుకోకుండా, తమ విధులకు న్యాయం చేయని వారిపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఈవో ఆదేశించారు. ఇప్పుడే కాకుండా గతంలో కూడా అన్నవరం సిబ్బందిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఎన్ని విమర్శలు వచ్చినా, ఎన్ని చర్యలు తీసుకున్నా అన్నవరంలో సిబ్బంది తీరు మారడం లేదని భక్తులు అంటున్నారు. సేవల విషయంలో నిర్లక్ష్యం వీడటం లేదని ఆరోపిస్తున్నారు

## యధేచ్ఛగా భూ దోపిడీ

(విశాఖపట్నం - జయజయహే)



అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో అయినవారికి అడ్డగోలు భూకేటాయింపులు చేసిన కూటమి ప్రభుత్వం తాజాగా మరో భూదోపిడీకి సిద్ధమైందని వైయస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ లోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, మంత్రి లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ కు చెందిన గీతం సంస్థ 54 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే... దాన్ని రెగ్యులరైజ్ చేస్తున్న ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎంపీ భరత్ కు చెందిన గీతం సంస్థ రూ.5వేల కోట్ల విలువైన భూమిని ఆక్రమిస్తే.. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ పెట్టాల్సింది పోయి.. రెగ్యులరైజ్ చేయాలన్న నిర్ణయం ప్రభుత్వ బరితెగింపుకు ప్రత్యక్షనిదర్శనమని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇలాంటి రాచరిక పోకడలు సరికాదని.. ప్రభుత్వ ఆస్తులకు కస్టోడియన్స్ గా ఉండాల్సిన వారే కాటేసే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రెండేళ్లుగా అక్రమ కేటాయింపులతో కూటమి ప్రభుత్వం విశాఖలో ప్రభుత్వ భూమి హారతి కర్పూరంలా కరిగిస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కితీసుకునేంత వరకు వైయస్.జగన్ నేతృత్వంలో వైయస్సార్సీపీ పోరాటం తధ్యమని అమర్ స్పష్టం చేశారు. 18 నెలల పాలనలో రూ.3 లక్షల కోట్లు అప్పు ప్రజల నెత్తిన పెట్టిన ప్రభుత్వం.. తమ వారికి మాత్రం రూ. 30 వేల కోట్ల భూసంతర్పణ చేసిందని తేల్చి చెప్పారు. దావోస్ పర్యటనకు రూ.25 కోట్లు ప్రజా ధనం వృధా చేసిన చంద్రబాబు.. పెట్టుబడులేవీ లేకుండానే వట్టి చేతులతో తిరిగొస్తే.. అనుకూల మీడియాలో మాత్రం దావోస్ మ్యాన్ అంటూ డబ్బా కొట్టుకోవడాన్ని తప్పు పట్టారు. మరోవైపు తిరుమల లడ్డూ విషయంలోనూ సీఎం చంద్రబాబు అభాసుపాలయ్యారని అమర్నాథ్ స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు లేదన్న దర్యాప్తు సంస్థ ఛార్జ్ షీట్ తో బాబు నీచ రాజకీయం బట్టబయలైందన్నారు. మరోవైపు అన్నవరం ప్రసాదం కౌంటర్లో స్వైరవిహారం చేస్తున్న ఎలుకలు... నిర్వహణ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమని తేల్చి చెప్పారు. చివరకు ప్రసాదం పవిత్రను కూడా కూటమి ప్రభుత్వం నీరుగార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జనసేన లోకల్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి...

దృష్టి పెట్టారట. వీటిపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై జనసేన నేతలతో ఇటీవలే పవన్ సమావేశం నిర్వహించారు. కొందరు పార్టీ నేతల చుట్టూ ఉన్న వివాదాలు ఆర్థిక, వ్యక్తిగత ఘర్షణలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత, కుల విభేదాలు, వివాహేతర సంబంధాల విషయంలో జరుగుతున్న గొడవలపై పవన్ ఆరా తీసినట్లు ఇన్‌సైడ్ టాక్.

అలాంటివన్నీ వ్యక్తిగత అంశాలుగా మాత్రమే చూడాలని..పార్టీ పరంగా వారిపై యాక్షన్ తీసుకోవాలని ముఖ్య నేతలకు సూచించారు పవన్. అయితే ఇలాంటివన్నీ పార్టీకి ఆపాదించే కుట్ర జరుగుతుందని అలాంటి వాటిని తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచిస్తున్నారు పవన్. అయితే పవన్ ఇంతలా పార్టీపై ఫుల్ ఫోకస్ పెట్టడానికి ప్రధాన కారణం స్థానిక సంస్థల ఎన్నికలే అంటున్నారు నేతలు. సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు మాత్రమే తీసుకున్న పవన్..స్థానిక సంస్థల ఎన్నికల్లో..మెజార్టీ స్థానాలు తీసుకుని పట్టు సాధించేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారట. కూటమిలో భాగంగా జనసేనకు బలం ఉన్నచోట్ల ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉన్నారట. మార్చిలోపు పార్టీ నిర్మాణం పూర్తి చేసి..స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలనేది పవన్ ఆలోచనగా చెబుతున్నారు. పాలిటిక్స్ ఈజ్ ఆల్‌వేస్ డైనమిక్స్. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎప్పటికప్పుడు పరిస్థితులను బట్టి మారుతూనే ఉంటాయ్. పాలిటిక్స్ ఎప్పుడు ఎలా ఉంటాయో ఎవరు చెప్పలేని పరిస్థితి. పైగా ప్రజెంట్ పాలిటిక్స్ అయితే వెరీ డిఫరెంట్. ఇవాళ ఓ పార్టీలో ఉన్న నేత రేపు ఏ పార్టీలో ప్రత్యక్షం అవుతారో..ఎందుకు పార్టీ మారుతారో అంతకంటే అర్థం కానీ పొలిటికల్ సినారియో ఈనాటిది. రాజకీయం అంటే అవసరాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అన్నట్లుగా మారిపోయిన సిచ్యువేషన్. కానీ జనసేన పుట్టుక వేరు. అది నడుస్తున్న తీరు వేరు. ఓ లక్ష్యం కోసం..రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్తుంటారు పవన్ కల్యాణ్. తానే రెండుచోట్ల ఓడినా..ఆయన పార్టీ ఎక్కువ రోజుల ఉండదని విమర్శలు వచ్చినా..ఆయనెక్కడా తగ్గలేదు. పదవుల కోసం ఆరాటపడలేదు. కానీ పార్టీని మాత్రం లైమ్‌లైట్‌లో ఉంచుతూ వచ్చారు. ఎందుకంటే గతంలో ఎంతోమంది పార్టీలు పెట్టి కొన్ని రోజులు పాలిటిక్స్‌లో ఉండి తిరిగి బ్యాక్ టు పెవిలియన్ అన్నవారున్నారు. కానీ పవన్ రూటు సెపరేటు. ఆయనదంత ఫ్యూచర్ ప్లాన్. అధికారం, ప్రతిపక్షం అనే మాటల కంటే..మంచి కోసం మార్పు అనే లైన్‌లోనే పనిచేసుకుంటూ వస్తున్న సేనాని ఇప్పుడు సరికొత్త స్కెచ్ వేస్తున్నారట. జనసేన అనేది అధికారం కోసం..అవసరాల కోసం ఏర్పడలేదని ప్రూవ్ చేసేందుకు..రాబోయే తరానికి మంచి నేతలను..మంచి రాజకీయ సంప్రదాయాలను అందించేలా ఫ్యూచర్ ప్లాన్ రెడీ చేశారట. అందుకు స్థానిక సంస్థల ఎన్నికలను, మున్సిపోల్స్‌ను అస్త్రంగా మార్చుకోవాలని భావిస్తున్నారట సేనాని. పవన్ స్ట్రాటజీస్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి.

## 27న అఖిలపక్షం

### బడ్జెట్ సమావేశాలపై చర్చ

### 28 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### కేంద్ర ప్రభుత్వం కసరత్తు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బడ్జెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బడ్జెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.




## ఇండిగోకు 700కి పైగా స్లాట్‌లు కట్

మొదటి పేజీ తరువాయి...

సుమారు 2,507 ఇండిగో విమానాలు రద్దు చేయడం జరిగింది. 1,852 విమానాలు ఆలస్యం అయ్యాయి, ఇది దేశవ్యాప్తంగా 3,00,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం చూపింది. ఈ అంతరాయం నేపథ్యంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కఠినమైన చర్యలు తీసుకుంది. ఇండిగో శీతాకాల షెడ్యూల్‌ను 10 శాతం తగ్గించింది. దీని కారణంగా ఇండిగో విమానయాన సంస్థ తన కొన్ని సేవలను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ ఆదేశాన్ని పాటిస్తూ, ఇండిగో ఇప్పుడు 717 ఉచిత స్లాట్‌ల జాబితాను మంత్రిత్వ శాఖకు సమర్పించింది. స్లాట్ అంటే విమానాశ్రయంలో విమానం ల్యాండింగ్, బయలుదేరడానికి కేటాయించిన నిర్ణీత సమయం. ఇండిగో ఖాళీ చేసిన స్లాట్లలో అత్యధిక వాటా దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఉంది. 717 స్లాట్లలో 364 ఆరు ప్రధాన మెట్రో విమానాశ్రయాలలో ఉన్నాయని సూచిస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్. వీటిలో, హైదరాబాద్ ఉ బెంగళూరు అత్యధిక సంఖ్యలో స్లాట్‌లను కలిగి ఉన్నాయని చెబుతున్నారు. జనవరి నుండి మార్చి వరకు ఈ స్లాట్‌లను ఖాళీ చేశారు. ఈ పరిస్థితిని పరిష్కరించడానికి, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించింది. ఇతర విమానయాన సంస్థల నుండి దరఖాస్తులను కోరింది. ప్రయాణీకులకు అసౌకర్యాన్ని నివారించడానికి ఇండిగో ఖాళీ చేసిన స్లాట్‌లను ఇతర విమానయాన సంస్థలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. అయితే, ఈ కొత్త స్లాట్‌లను పొందడానికి ఏ విమానయాన సంస్థ కూడా దాని ప్రస్తుత మార్గాలను మూసివేయకూడదని మంత్రిత్వ శాఖ స్పష్టంగా పేర్కొంది. ప్రభుత్వం ఇతర విమానయాన సంస్థలను ఆహ్వానించినప్పటికీ, విమానయాన నిపుణులు కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని భావిస్తున్నారు. దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది, నెట్‌వర్క్ ప్లానింగ్, కొత్త మార్గాలను ప్రారంభించడం అనేది సుదీర్ఘమైన ప్రక్రియ. అంత త్వరగా సాధించడం కష్టం. కొత్త మార్గాన్ని ప్రారంభించి, ఒకటి లేదా రెండు నెలల తర్వాత దానిని మూసివేయడం ఆచరణాత్మకం కాదు. మరో ప్రధాన కారణం ఏమిటంటే, ఖాళీ స్లాట్‌లలో ఎక్కువ భాగం "రెడ్-ఐ" విమానాల కోసం కేటాయించనవి. ఇవి రాత్రి ఆలస్యంగా లేదా తెల్లవారుజామున నడిచే విమానాలు. ప్రయాణీకులు సాధారణంగా ఈ సమయాల్లో ప్రయాణించకూడదని ఇష్టపడతారు. కాబట్టి విమానయాన సంస్థలు ఈ స్లాట్‌లను తక్కువ లాభదాయకంగా భావిస్తాయి. ఈసారి విమానయాన సంస్థల ఏకపక్ష వైఖరిపై డీజీసీఏ కఠిన వైఖరి తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. స్లాట్ కోతలతో పాటు, నియంత్రణ సంస్థ జనవరి 17న కార్యాచరణ లోపాల కారణంగా ఇండిగోపై రూ. 22.20 కోట్ల భారీ జరిమానా విధించింది. ఎయిర్‌లైన్ సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు కూడా హెచ్చరిక జారీ చేశారు. విషయం అక్కడితో ముగియలేదు. డీజీసీఏ కూడా ఇండిగోను రూ. 50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని డిపాజిట్ చేయాలని ఆదేశించింది.



## టీడీపీలో కోవర్డుల రచ్చ

మొదటి పేజీ తరువాయి...

అభిమానులు సోషల్ మీడియా సాక్షిగా వాదులాడుకుంటున్నారు. ఒకరిపై ఒకరు వ్యతిరేక పోస్టులు పెట్టుకుంటున్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ముందుగా మట్లాడిన చింతమనేని" కూటమి అంటే టీడీపీ జనసేన బీజేపీ మాత్రమే. కొంతమంది కోవర్టులు టీడీపీ కండువా కప్పుకున్నారు. వారు బై బర్త్ వైయస్సార్, ఇప్పుడు టీడీపీ అంటూ ముసుగు కప్పుకున్న కోవర్టులు. రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ కండువా కప్పుకున్నారు. తేడా వస్తే వాళ్లు మళ్లీ అక్కడకు వెళ్లిపోతారు. మని ముసుగులో ఉండి మని కత్తితో చెట్లు నరకొద్దని మిమల్ని కోరుకుంటున్నాను. భవిష్యత్తులో అయినా పార్టీలో ఎవరైనా జాయిన్ చేసుకోవాలంటే తప్పనిసరిగా నియోజక వర్గ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకోవాలి." అని సీరియస్ కామెంట్స్ చేశారు. చింతమనేని ఎక్కడ కూడా పార్థసారథి కానీ, వేరే నాయకుడి పేరు ప్రస్తావించలేదు. అక్కడ ఉన్న నేతల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరింది ఒక్క పార్థసారథే ఉన్నారు. అందుకే చింతమనేని మాటలకు పార్థ సారథి నొచ్చుకున్నారు. అందుకే అదే వేదికపై టీడీపీ ఎమ్మెల్యేకు కౌంటర్ ఇచ్చారు. అయితే అప్పటికే తన ప్రసంగం పూర్తి అయిన తర్వాత చింతమనేని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే చింతమనేని కామెంట్స్‌పై మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ...." వైసిపి నేతలు, కార్యకర్తలు చేరికలు అధిష్ఠానం నిర్ణయం మేరకే జరిగాయి. అధినాయకుడు తీసుకున్న నిర్ణయమే ఫైనల్. పార్టీలోకి ఎవరు వచ్చినా ఎవరు రావాలన్నా అంతిమ నిర్ణయం ఆయనది. తర్వాత లోకేష్‌దే. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా అధిష్టానం చెప్పినట్లు వినవలసిందే అధిష్టానం నిర్ణయమే శిరోధర్యం" అని అన్నారు.

# నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

**జయజయహే**

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ షాపులో శనివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం ఇద్దరు పిల్లలతో సహా ఆరుగురు వ్యక్తులు అగ్నికీలల్లో చిక్కుకున్నారు.వీరిలో ఒకరు తప్పించుకుని బయటపడగా..మిగతా ఐదుగురి ఆచూకీ అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా లభించలేదు. వివరాల్లోకి వెళ్తే.. అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందీ ప్రచార సభ పక్కన ఉన్న ఐదంతస్తుల సాయి విశ్వాస్ చాంబర్‌లో బచాస్ ఫర్నిచర్ క్యాస్టిల్ పేరుతో వివిధ రకాల ఫర్నిచర్ వ్యాపారాలను సతీశ్ అనే వ్యాపారి నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో అకస్మాత్తుగా ఈ భవనంలో మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై వెంటనే యజమాని సతీశ్ అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.తమ భవనంలో మంటలు, దట్టమైన పొగలు వస్తున్నాయని పోలీసులకు తెలపడంతో అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ కొద్ది నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని ముందుగా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. నాంపల్లి స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అన్ని రహదారులను మూసివేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 20 ఫైరింజన్లను రప్పించి మంటలను ఆర్పించారు. అగ్నికీలలు, దట్టమైన పొగ క్షణ క్షణానికి పెరుగుతుండడంతో రాత్రి వరకు అందులో ఉన్న వారిని బయటకు తీసుకురాలేక పోయారు. కాగా, ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

**ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు వ్యక్తులు**

ఫర్నిచర్ దుకాణం భవనంలో ఐదుగురు వ్యక్తులు చిక్కుకున్నారు. సెల్లార్ వాచ్‌మెన్ యాదయ్య, లక్ష్మి దంపతుల పిల్లలు ప్రణీత్, అఖిల్‌తో పాటు ఆటో డ్రైవర్ హబీబ్, ఇంతియాజ్, స్వీపర్ బీబీలు చిక్కుకున్నవారిలో ఉన్నారు. అయితే అఖిల్ (7), ప్రణీత్ (11)గన్‌ఫౌండ్రీలోని ప్రభుత్వ ఆలియా పాఠశాలలో చదువుతున్నారు. శనివారం పాఠశాలకు వెళ్లకపోవడంతో ఇద్దరు పిల్లలను సెల్లార్‌లోని ఇంట్లోనే ఉంచి తల్లిదండ్రులు ఇద్దరు బయట ఉన్నారు. అదే సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ఆ ఇద్దరు పిల్లలను తీసుకువచ్చేందుకు ఫర్నిచర్ షాపులో పనిచేసే ఇద్దరు వ్యక్తులు సెల్లార్‌లోకి వెళ్లారు. ఈ ఇద్దరితోపాటు అందులో పని చేసే మరో ఇద్దరు సెల్లార్‌లో చిక్కుకున్నట్లు తోటి వర్కర్లు వెల్లడించారు. వీరిలో ఒకరు తప్పించుకొని బయటపడ్డాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు ఫైర్ పోలీసు, ఇతర శాఖల అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

సెల్లార్‌లో ఫైర్ ఇంజిన్ల ద్వారా మంటలు, దట్టమైన పొగలు ఆర్పడంతో సెల్లార్ మొత్తం నీటితో నిండిపోయింది. ఐదుగురు వ్యక్తులను బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**రోబోను పంపించినా...**

అగ్నిప్రమాదాన్ని అదుపులోకి తేచ్చేందుకు పోలీసులతో పాటు హైడ్రా, డిజాస్టర్ ఫోర్స్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు పలువురు అధికారులు అర్ధరాత్రి వరకు శ్రమించారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ పొగ తీవ్రత ఇంకా అదుపులోకి రాలేదు. సెల్లార్‌లో ప్లాస్టిక్ వస్తువులు, ఫర్నిచర్ ముడిపదార్థాలు ఉండడంతో ఆరు గంటలైనా భవనం నుంచి దట్టమైన పొగ తగ్గలేదు. ఫైర్ ఉన్నతాధికారులు రోబోను కూడా భవనంలోకి మంటలను, పొగలను నివారించేందుకు పంపించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అర్ధరాత్రి వరకు దట్టమైన పొగలు అదుపులోకి రాలేదు.రెస్క్యూ పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

**బ్రామ్‌టో ఫైర్ మిషన్‌తో..**

ఫైర్ అధికారులు బ్రామ్‌టో ఫైర్ మిషన్‌తో మంటలను, దట్టమైన పొగలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అతి పెద్దదైన బ్రామ్‌టో మిషన్‌లో ఫైర్ సిబ్బంది ఉండి భవనం పరిసరాల 4, 5 వ అంతస్థుల అద్దాలను పగలగొట్టి మంటలను, పొగలను అదపులోకి తెచ్చేందుకు కృషి చేశారు.

**నిమిషంలో తప్పించుకొని..**

నాంపల్లి అగ్నిప్రమాదం నుంచి నిమిషం వ్యవధిలో తప్పించుకున్నాడు సంతోష్ అనే వ్యక్తి. ప్రమాదం జరిగిన సమయంలో సంతోష్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్నాడు. సెల్లార్‌లో మంటలు చెలరేగిన నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తం వ్యాపించాయి. అయితే ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన సంతోష్ నిమిషాలలో మెట్లపై నుంచి వేగంగా బయటికి వచ్చేశాడు. క్షణం ఆలస్యమైనా మంటల్లో చిక్కుకునేవాడనని సంతోష్ పేర్కొన్నారు.

**మంటలను అదుపులోకి తెచ్చాం : రాష్ట్ర ఫైర్ విభాగం డీజీ విక్రమ్‌సింగ్ మాన్**

ఈ ప్రమాదంలో ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురు చిక్కుకున్నారని తెలంగాణ రాష్ట్ర ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. ఫైర్, ఇతర అధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ పనులపై పలు సూచనలు చేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం కింద రెండు సెల్లార్‌లు ఉన్నాయన్నారు. మొదటి సెల్లార్‌లో ఫర్నిచర్‌కు సంబంధించిన మెటీరియల్స్, ఇతర ముడి పదార్థాలు ఉండడంతోనే సహాయక చర్యలకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. మంటలను అదుపులోకి తెచ్చామని, సెల్లార్లలో దట్టమైన పొగలు రెస్క్యూ ఆపరేషన్ ద్వారా అదుపులోకి తీసుకువచ్చి ఇందులో చిక్కుకున్న ఐదుగురిని బయటకు తెస్తామన్నారు. 200 మంది సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని వివరించారు.

**సజ్జనర్, కలెక్టర్ హరిచందన సందర్శన**

సంఘటన స్థలాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, సీపీ సజ్జనర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారన్నారు. అందులో చిక్కుకున్న వారిని సురక్షితంగా తెచ్చేందుకు ఫైర్‌తో పాటు ఇతర శాఖల అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**రోబో యంత్రాన్ని తొలిసారిగా వాడిన అగ్నిమాపక శాఖ**

నాంపల్లిలో శనివారం జరిగిన భారీ అగ్ని ప్రమాద సంఘటనలో పేలుళ్లను నిరోధించేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక శాఖ రోబో ఫైర్ మిషన్‌ను హైదరాబాద్‌లో తొలిసారిగా ఉపయోగించింది. ఘటనా స్థలంలో జేసీబీ, భారీ క్రేన్లతో సహాయక చర్యలు చేపట్టినా అగ్నికీలలు, దట్టమైన పొగ కారణంగా సిబ్బంది లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. దీంతో అగ్నిమాపక శాఖ రోబో శకటాన్ని రంగంలోకి దింపింది. రోబో ఫైర్ మిషన్ అనేది అగ్ని ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు, అగ్నిమాపక సిబ్బందికి సహాయం చేయడానికి తయారు చేసిన సిస్టమ్. అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని పరిస్థితుల్లో ఈ రోబో ఫైర్ మిషన్ భవనం లోపలికి వెళ్లి మంటలను ఆర్పుతుంది. అలాగే సురక్షిత మార్గాన్ని అన్వేంచి, బయట ఉన్న సిబ్బందికి మార్గాన్ని సూచిస్తుంది.



# రోడ్ కోసం వినతిపత్రం

**కొయ్యూరు : (జయ జయహే)జనవరి 25**

అల్లూరి జిల్లా మారుమూల బూదరాళ్ల పంచాయితీ పరిధిలో బూదరాళ్ల గ్రామం నుండి దొడవగొయ్యి మీదుగా కిండంగి గ్రామం వరకు 6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించాలని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ సభ్యుడు సంజీవ్ గ్రామస్థులతో కలిసి కొయ్యూరులో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం 6కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు ఉందన్నారు. వర్షకాలం వచ్చిందంటే పూర్తిగా కొట్టుకోపోతుందని, కావున తారురోడ్డు మంజూరు చేయాలనీ ఏఈ గారికి కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

# 'నేషనల్ మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కేంద్రం సమ్మతి

**ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి**

**కాకినాడ, జనవరి 24 : (జయ జయహే)**





జిల్లా కేంద్రం కాకినాడలో కేంద్ర టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'నేషనల్ మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్'ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సమ్మతించినట్లు కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో చేనేతరంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కాకినాడలో మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెలలో కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు లేఖ రాయగా సానుకూలంగా స్పందించి సంబంధిత జిల్లా శాఖ అధికారుల నుండి ప్రతిపాదనలు పంపిస్తే 'నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'ద్వారా త్వరలోనే కాకినాడలో మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు ద్వారా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగానికి జాతీయస్థాయిలో గుర్తింపు గుర్తింపు వస్తుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మడుతూరు మునసబు మృతి

**నివాళులర్పించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

**పాడె మోసిన మాజీ ఎంపీ పప్పల చలపతిరావు**

**యలమంచిలి, జనవరి 24, జయ జయహే:**



అచ్చుతాపురం మండలం మడుతూరు గ్రామానికి చెందిన మాజీ మునసబు, అచ్చుతాపురం మండలం మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు ప్రస్తుతం మడుతూరు శ్రీ నూకంబిక దేవస్థానం చైర్మన్ మోటూరు త్రినాథ స్వామి శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతి రావు ఘనమైన నివాళులర్పించి కుటుంబ సభ్యులును ఓదార్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడే మోశారు. గ్రామంలో ఉన్న ప్రజలంతా మునసబుగా ఆయన గ్రామానికి చేసిన అభివృద్ధిని గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.ఆ యన గ్రామంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తలచుకొని గ్రామ ప్రజలంతా మునసబు లేని లోటు తీర్చలేనిదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ ,నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్యా బుజ్జి , అచ్చుతాపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పీలా తులసీరామ్, అచ్యుతాపురం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావులతో పాటు రాజకీయ పార్టీల నేతలంతా పాల్గొని నివాళులు అర్పించారు.



# ఆదివాసి కాలనీలో మంచినీరు సౌకర్యం!

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి జిల్లా అరకు వేలి మండలం పెదలబుడు పంచాయితీ ఆదివాసి కాలనీలో మంచినీరు కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూస్తూ గుర్తించి ఆదివాసి కాలనీలో మండల పరిషత్ నిధులతో మంచి నీరు సౌకర్యం కల్పించిన అరకు వేలి సెగ్మెంట్ 2 ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్ 1,50.000/- రూ లక్ష యాభై వేలు వేయంతో నూతనంగా నిర్మించిన హ్యాండ్ బోర్ ను పెదలబుడు సెగ్మెంట్ 2 ఎంపీటీసీ దురియ ఆనంద కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అరకు వేలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్ర సల్మాన్ రాజు, గోవిందు, గుజ్జల మహేష్, మరియు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# అభయం రక్తదాన శిబిరంలో విశ్వజ్యోతి విద్యార్థులు రక్తదానం

**టెక్కలి (జయ జయహే)**

అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలలో శనివారం శ్రీ విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పినకాన జోగారావు సౌజన్యంతో 15 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి వచ్చిన విద్యార్థులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ.. జ్ఞాపిక తో సత్కరించి పోషకాహార కిట్ అందజేశారు. ఈ కార్యక్రమం లో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు, సంఘ సభ్యులు అద్దాల వీరభద్రాచారి, కళాశాల అధ్యాపకులు లక్ష్మణరావు, హరికృష్ణ, మధు,మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

# చందన యాత్రకు సర్వం సిద్ధం
# భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డు లోని క్వారీ సెంటర్ సమీపంలోని సింహాచలం నగర్ శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో ఈ నెల 25 నుంచి 30 వరకు జరగనున్న చందన యాత్ర మహోత్సవాలకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు ఎటువంటి అసౌకర్యం లేకుండా దర్శనం చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రస్టు ధర్మకర్తలు కాలేను సూర్య సింహాచలం, కాలేపు నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నిజరూప దర్శనం జరిగే జనవరి 28వ తేదీన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను క్రమబద్ధీకరించడంతో పాటు తాగునీరు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలు కూడా పకడ్బందీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.చందన యాత్ర సందర్భంగా అన్నదాన కార్యక్రమం, భజనలు, ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంచనున్నాయని ఆలయ అధికారులు అభిప్రాయపడ్డారు.



# వైరల్ వీరత్వం వెనుక ముసుగు..

**జయశాంతి వ్యవహారంలో బయటపడుతున్న సంచలన నిజాలు**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట పోలీసు స్టేషన్ లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ జయశాంతి పేరు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వేదికలపై పెద్ద చర్చకే కారణమైంది. చంటి బిడ్డను ఎత్తుకుని ట్రాఫిక్ క్లియర్ చేసిన వీడియో ఒక్కసారిగా వైరల్ కావడంతో ఆమెను "డ్యూటీకి అంకితమైన మహిళా పోలీస్"గా పొగడ్తలతో ముంచేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రశంసలు, హోం మంత్రి అనిత ఇంటికి ఆహ్వానించి సన్మానం చేయడం వరకు వ్యవహారం వెళ్లింది. కానీ ఇప్పుడు ఆ వైరల్ వీరత్వం వెనుక ఉన్న మరో కోణం బయటపడడంతో ఈ కేసు తీవ్ర వివాదంగా మారింది.విద్యాశాఖ అధికారుల విచారణలో గత ఏడాది జరిగిన డీఎస్సీలో జయశాంతి తప్పుడు ఈడబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయ్యింది. కానిస్టేబుల్‌గా ఉన్న భర్త తాతారావు ఆదాయాన్ని దాచిపెట్టి, తండ్రిని సంరక్షకుడిగా చూపిస్తూ సర్టిఫికెట్ పొందినట్టు



అధికారులు గుర్తించారు. దీంతో డీఎస్సీ ఉద్యోగాన్ని రద్దు చేసిన విద్యాశాఖ, ప్రభుత్వాన్ని మోసం చేసిన వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కాకినాడ డీఈవో తూర్పుగోదావరి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.ఇదే సమయంలో నకిలీ ఐడీ కార్డుతో ఎస్ఐగా చలామణి అవుతున్న కామేశ్వరరావు అనే హెడ్ కానిస్టేబుల్‌కు జయశాంతి సహకరించిందన్న ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఇటీవల జరిగిన ట్రాఫిక్ ఘటన కూడా ప్లాన్ ప్రకారమే జరిగిందన్న విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. క్రమశిక్షణ చర్యలలో భాగంగా జయశాంతిని రైల్వే విభాగం నుంచి లా అండ్ ఆర్డర్‌కు, ఆమె భర్తను ఇతర యూనిట్‌కు బదిలీ చేయడం ఈ వివాదానికి మరింత బలం చేకూర్చింది.వైరల్ కథనాల వెనుక వాస్తవాలు వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఎలా స్పందిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిజంగా ఇది సేవా మనసా? లేక విమర్శల నుంచి తప్పించుకునే వ్యూహమా? అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

For a pure tomorrow..
జయహే

# రథసప్తమి ప్రాశస్త్యం



## సూర్యనారాయణ స్వామి షోడశోపచార పూజా విధాన

### రథసప్తమి సందర్భంగా..

మాడుగుల జనవరి 24
జయ జయహే

ప్రత్యక్ష దైవమైన , శుభకరుడైన సూర్యనారాయణుని జయంతిని సూర్యజయంతి లేదా రథసప్తమి పండుగగా మాఘమాస శుద్ధ సప్తమి నాడు జరుపుకుంటారు. ఈ సూర్యజయంతి ఈసారి ఆదివారం రావడం విశేషం. ఈ రోజున సూర్యోదయ సమయమందు ఆకాశంలోని గ్రహ నక్షత్ర సన్నివేసం రథం ఆకారంలో ఉండుట చేత ఈ రోజుకి రథసప్తమి అని పేరు వచ్చింది.

**జిల్లేడు స్నానం ఏవిధంగా చేయాలి**

రథసప్తమి రోజున జిల్లేడు స్నానం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ విశేషమైన పుణ్యదినమున అర్కః అను నామము కలిగిన సూర్యనారాయణునికి ప్రీతికరమైన శ్వేత అర్కపత్రముల(తెల్ల జిల్లేడు ఆకుల) కు రంధ్రం చేసి,ఆ రంధ్రంలో రేగిపండు ఉంచి శిరస్సుపై , భుజములపై , హృదయంపై ఉంచి శిరస్నానం చేయవలెను. అదేవిధంగా రంధ్రం చేసిన జిల్లేడు ఆకు మధ్యనుంచి సూర్యుని దర్శనం చేసుకొని నమస్కరించవలెను.

**పొంగలి చేయు విధానం**

స్త్రీలు రథసప్తమి రోజున చిక్కుడు ఆకులు , చిక్కుడు పువ్వులు , చిక్కుడు కాయలతో వివిధ ఫల, పుష్పాలను సేకరించి సంక్రాంతి గొబ్బెమ్మలు పిడకలుగా అయినవి తెచ్చి పాలదాలిగా తులసికోట వద్ద అమర్చుకొని సూర్యునికి ఎదురుగా ఆవుపాలను పొంగించి, పొంగలి చేయవలెను. తదుపరి సూర్యనారాయణ స్వామి షోడశోపచార పూజ పూర్తి చేసి , పొంగలిని చిక్కుడు ఆకులయందు ఉంచి సూర్యదేవునికి ప్రసాదంగా నివేదించాలి. ఈ విధంగా రథసప్తమి రోజున ప్రత్యక్ష దైవం సూర్య నారాయణ స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలి.



(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ సంస్కృతిలో సూర్యారాధనకు అత్యంత విశిష్టమైన, పవిత్రమైన మరియు పురాతనమైన స్థానం ఉంది. ప్రత్యక్ష దైవంగా భావించే సూర్య భగవానుడు ఉదయించిన రోజైన మాఘ శుద్ధ సప్తమిని మనం 'రథసప్తమి'గా ఎంతో భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరుపుకుంటాము. దీనిని మాఘ సప్తమి లేదా సూర్య జయంతి అని కూడా పిలుస్తారు. ప్రకృతి ఆరాధనే పరమావధిగా సాగే ఈ పండుగ, కఠినమైన శీతాకాలపు చలి ముగిసి వసంత కాలపు ఆహ్లాదకరమైన రాకను మరియు కొత్త జీవకళను సూచిస్తుంది. సూర్యుడు తన దిశను మార్చుకుంటూ ఉత్తరాయణ పుణ్యకాలంలో భాగంగా మకర రాశి నుండి కుంభ రాశిలోకి ప్రవేశించే ఈ సమయం ఆధ్యాత్మికంగానూ, వైజ్ఞానికంగానూ ఎంతో శక్తివంతమైనదిగా పరిగణించబడుతుంది.**



పురాణాల ప్రకారం, కశ్యప ప్రజాపతి మరియు అదితి దంపతులకు సూర్యుడు ఈ పవిత్రమైన రోజే జన్మించినట్లు మన ప్రాచీన వేద గ్రంథాలు మరియు పురాణాలు స్పష్టంగా చెబుతున్నాయి. అందుకే ఈ రోజున సూర్యుడిని మనస్ఫూర్తిగా ఆరాధించడం వల్ల శరీరంలో ఉన్న దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు సైతం తొలగిపోయి, పరిపూర్ణమైన ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. రథసప్తమి నాడు చేసే స్నానం, ఇచ్చే దానం మరియు చేసే జపానికి అనంతమైన పుణ్య ఫలితాలు ఉంటాయని వేద పండితులు ఘోషిస్తున్నారు. ముఖ్యంగా ఈ రోజున సూర్యోదయ సమయంలో పవిత్ర నదులలో లేదా జలాశయాలలో స్నానం చేయడం అత్యంత పుణ్యప్రదమైనదిగా భారతీయులు భావిస్తారు.

రథసప్తమి నాడు ఆచరించే స్నాన విధి చాలా ప్రత్యేకమైనది మరియు శాస్త్రీయ అర్థం కలిగినది. ఈ పవిత్రమైన రోజున ఏడు జిల్లేడు ఆకులను అంటే శిరస్సుపై ఒకటి, రెండు భుజాలపై, రెండు మోకాళ్లపై మరియు రెండు పాదాలపై ఉంచుకుని నదిలో స్నానం చేస్తారు. జిల్లేడు ఆకును సంస్కృతంలో 'అర్క పత్రం' అని పిలుస్తారు. సూర్యుడికి ఒక పేరు 'అర్క' అని ఉండటం వల్ల, ఈ ఆకులతో స్నానం చేయడం వల్ల ఏడు జన్మల నుంచి వెంటాడుతున్న పాపాలు మరియు దోషాలు పూర్తిగా తొలగిపోతాయని ధర్మశాస్త్రం చెబుతోంది. అంతేకాకుండా, స్నానం చేసేటప్పుడు సూర్య కిరణాలు శరీరంపై నేరుగా పడటం వల్ల అనేక రకాల చర్మ వ్యాధులు నయమవుతాయని, శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యపరంగా కూడా శాస్త్రీయ గుర్తింపు ఉంది.

స్నానం ముగించిన అనంతరం ఇంటి ముందు రథం ఆకారంలో అందమైన రంగురంగుల ముగ్గులు వేసి, చిక్కుడు కాయలతో చిన్న రథం తయారు చేసి, సూర్య భగవానుడిని భక్తితో ఆరాధిస్తారు. ఈ రోజున పాలు పొంగించడం అనేది ఒక అతి ముఖ్యమైన సంప్రదాయం. కొత్త మట్టి పాత్రలో పాలను సూర్యరశ్మి నేరుగా పడే చోట ఉంచి, ఆ పాలు పొంగిన తర్వాత అందులో కొత్త బియ్యం మరియు స్వచ్ఛమైన బెల్లం వేసి పరమాన్నం తయారు చేస్తారు. దీనిని సూర్య భగవానుడికి అత్యంత భక్తితో నైవేద్యంగా సమర్పిస్తారు. చిక్కుడు ఆకులపై ఈ పవిత్ర ప్రసాదాన్ని ఉంచి కుటుంబ సభ్యులందరూ భక్తితో స్వీకరిస్తారు. సూర్యుడు ఆరోగ్య ప్రదాత కాబట్టి, ఈ ప్రసాదం ఆరోగ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు.

సూర్యారాధనలో భాగంగా ఈ క్రింది శక్తివంతమైన శ్లోకాలు పఠించడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండి విశేష ఫలితాలను పొందవచ్చు:

**"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ శ్రియం ఇచ్ఛేత్ హుతాశనాత్ । జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్ మోక్షం ఇచ్ఛేత్ జనార్దనాత్ ॥"**

సూర్య భగవానుడి నుండి ఆరోగ్యాన్ని, అగ్ని దేవుడి నుండి ఐశ్వర్యాన్ని, పరమశివుడి నుండి జ్ఞానాన్ని మరియు శ్రీమహావిష్ణువు నుండి మోక్షాన్ని కోరుకోవాలి. అంటే ఈ లోకంలో సూర్యుడే సాక్షాత్తు ఆరోగ్య ప్రదాత అని దీని ప్రధాన అర్థం.

**"నమః సవిత్రే జగదేక చక్షుషే జగత్ ప్రసూతి స్థితి నాశ హేతవే । త్రయీమయాయ త్రిగుణాత్మ ధారిణే విరించి నారాయణ శంకరాత్మనే ॥"**

ఈ అనంత లోకానికి ఏకైక చక్షువు (కన్ను) వలె ఉండి, ప్రపంచం యొక్క సృష్టి, స్థితి మరియు లయలకు మూల కారణభూతుడైన సూర్య భగవానుడికి వందనం. వేద స్వరూపుడు, మూడు గుణాలను ధరించిన వాడు మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమైన ఆ భాస్కరుడికి నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

రథసప్తమి అనేది కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదు, ఇది మన జీవనానికి ఆధారాన్ని మరియు శక్తిని ఇచ్చే సూర్య భగవానుడికి మనసారా కృతజ్ఞతలు తెలిపే అద్భుతమైన సందర్భం. సూర్యుడు తన ఏడు గుర్రాల రథంపై ఉత్తర దిశగా ప్రయాణాన్ని వేగవంతం చేసే ఈ రోజు నుండి భూమిపై పగలు సమయం పెరుగుతుంది. కాంతి చీకటిని ఏ విధంగానైతే తరిమివేస్తుందో, సూర్య భగవానుని అనుగ్రహం మనలోని అజ్ఞానాన్ని, అనారోగ్యాన్ని మరియు సోమరితనాన్ని తొలగించి సరికొత్త జ్ఞాన దీప్తిని నింపుతుంది. ఈ పర్వదినం నాడు ఆదిత్య హృదయం పఠించడం, సూర్యనమస్కారాలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కలుగుతాయి. ఈ పండుగ ద్వారా మనం పొందే దివ్య శక్తి ఏడాది పొడవునా మనల్ని ఉత్సాహంగా, చైతన్యవంతంగా మరియు కార్యశీలిగా ఉంచుతుంది. భానుడి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షిద్దాం.

# శశి థరూర్ - కాంగ్రెస్ మధ్య పెరుగుతున్న విభేదాలు


(సి.హెచ్.ప్రతాప్)

**కాంగ్రెస్ పార్టీ మరియు ఆ పార్టీ సీనియర్ నాయకుడు శశి థరూర్ మధ్య పెరుగుతున్న విభేదాలు భారత రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మేధావిగా, రచయితగా మరియు దౌత్యవేత్తగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన థరూర్, పార్టీ లైన్‌కు భిన్నంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేయడంపై తరచుగా వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా 'ఆపరేషన్ సిందూర్' అంశంపై ఆయన వ్యక్తం చేసిన ధిక్కార స్వరం, పార్టీ అగ్ర నాయకత్వంతో ఆయనకు ఉన్న సంబంధాల్లో నెలకొన్న అస్థిరతను మరోసారి స్పష్టం చేసింది. రాజకీయ విశ్లేషకులు దీనిని కేవలం ఒక వ్యక్తిగత అభిప్రాయంగా కాకుండా, పార్టీ అంతర్గత క్రమశిక్షణ మరియు భావప్రకటన స్వేచ్ఛ మధ్య జరుగుతున్న పోరాటంగా చూస్తున్నారు.**



శశి థరూర్ ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తాను పార్లమెంటులో ఎప్పుడూ పార్టీ మార్గదర్శకాలను ఉల్లంఘించలేదని, అయితే 'ఆపరేషన్ సిందూర్' విషయంలో మాత్రం తాను భిన్నమైన వైఖరిని అవలంబించానని బాహాటంగా ప్రకటించారు. 2002లో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత అప్పటి వాజ్పేయి ప్రభుత్వం పాకిస్తాన్ వైపు లక్ష్యంగా దాడులు చేయాలని భావించినప్పుడు, థరూర్ ఆ ప్రతిపాదనను బలపరిచారు. కాంగ్రెస్ పార్టీ ఆ సమయంలో సంయమనం పాటించాలని కోరినప్పటికీ, థరూర్ మాత్రం ఉగ్రవాదానికి గట్టి సమాధానం ఇవ్వాలనే ఉద్దేశంతో 'కైనెటిక్ రెస్పాన్స్' (భౌతిక దాడి) అవసరమని నమ్మారు. ఈ విషయంలో తాను ఏమాత్రం పశ్చాత్తాపం చెందడం లేదని (ఊనపొలొగెతిచ్) ఆయన స్పష్టం చేయడం విశేషం.

ఈ విభేదాలు కేవలం విదేశీ వ్యవహారాలకే పరిమితం కాలేదు.



గతంలో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గేపై పోటీ చేయడం ద్వారా థరూర్ పార్టీ అధిష్టానానికి ఒక సవాలు విసిరారు. గాంధీ కుటుంబం పట్ల అపారమైన గౌరవం ఉందని చెబుతున్నప్పటికీ, పార్టీ పనితీరులో మార్పు రావాలని ఆయన కోరడం నాయకత్వానికి మింగుడు పడటం లేదు. ముఖ్యంగా కేరళ రాజకీయాల్లో థరూర్ జోక్యం పెరగడం, అక్కడ ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణ స్థానిక కాంగ్రెస్ నాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీ అధికారిక కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించకపోవడం లేదా ఆయన పర్యటనల పట్ల అభ్యంతరం తెలపడం వంటి ఘటనలు ఈ అగాధాన్ని మరింత పెంచుతున్నాయి.

మరోవైపు, థరూర్ మద్దతుదారులు ఆయనను ఒక ఆధునిక చింతన కలిగిన నాయకుడిగా చూస్తారు. కేవలం పార్టీ చెప్పిందే వినడం కాకుండా, దేశ ప్రయోజనాల దృష్ట్యా సత్యాన్ని మాట్లాడటం ఆయన నైజమని వారు వాదిస్తారు. అయితే కాంగ్రెస్ హైకమాండ్ మాత్రం ఇలాంటి వైఖరి వల్ల పార్టీ ఐక్యత దెబ్బతింటుందని భావిస్తోంది. బిజెపి లాంటి బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే పార్టీలో ఒకే వాణి వినిపించాలని నాయకత్వం కోరుకుంటోంది. కానీ థరూర్ తన స్వతంత్ర శైలిని వదులుకోవడానికి సిద్ధంగా లేరని ఆయన తాజా ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి.

శశి థరూర్ వైఖరి పార్టీలో ఒక నైతిక సంక్షోభాన్ని సృష్టించింది. ఒకవైపు ఆయనకున్న మేధో సంపత్తి పార్టీకి బలం చేకూరుస్తుంటే, మరోవైపు ఆయన ధిక్కార స్వరం పార్టీకి ఇబ్బందిగా మారుతోంది. ఆపరేషన్ సిందూర్ లాంటి సున్నితమైన అంశాలను ఇప్పుడు ప్రస్తావించడం ద్వారా ఆయన తాను దేనికీ భయపడనని సందేశం ఇచ్చారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో థరూర్ కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా లేదా అన్న సందేహాలను కలిగిస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఈ విభేదాలను ఎలా పరిష్కరిస్తుందనే దానిపైనే కేరళలో మరియు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

థరూర్ మరియు కాంగ్రెస్ మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతలు భారత ప్రజాస్వామ్యంలో పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత వరకు ఉందనే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. కేవలం ఆజ్ఞలను పాటించే అనుచరులు కావాలా లేక ఆలోచనాత్మకమైన నాయకులు కావాలా అనే దానిపై పార్టీలు పునరాలోచన చేయవలసిన సమయం ఆసన్నమైంది. థరూర్ లాంటి నాయకులు పార్టీలో ఉన్నప్పుడే భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమవుతుంది, కానీ అది క్రమశిక్షణను అతిక్రమించకూడదనే నిబంధనను కూడా విస్మరించలేము.

# స్వచ్ఛతకు, స్వచ్ఛ విశాఖ అభివృద్ధికి సహకరించండి

## జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్రలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు




**విశాఖపట్నం, జనవరి 24, జయ జయహే**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా విశాఖ లో పారిశుధ్యం,పరిశుభ్రత లో లోపాలను గుర్తించి సవరిస్తూ స్వచ్ఛత కు ప్రాధాన్యత నివ్వాలని, స్వచ్ఛ విశాఖ అభివృద్ధికి సహకరించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన బీచ్ రోడ్డు వై ఎం సి ఏ సమీపంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బొత్స రాము ,మైలపల్లి నాగలక్ష్మి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు పి నల్లనయ్య, డివి రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ లతో కలిసి "జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను అందరితో కలిసి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2026 కు సంబంధించి ప్రతినెల మూడవ శనివారం నిర్వహించవలసిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల మార్గదర్శకాలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రూపొందించి విడుదల చేసిందన్నారు. ఆ మార్గదర్శకాలలో భాగంగా నేడు "జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్ర " కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. విశాఖ నగరానికి ఎన్ని పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చినా ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రథమ కర్తవ్యం గా కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి స్వస్తి పలకాలని, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని, బహిరంగ మల ,మూత్ర విసర్జనకు స్వస్తిపలికి ప్రజా,సామాజిక మరుగుదొడ్లను వినియోగించాలని, స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర ధ్యేయంగా స్వచ్ఛ విశాఖ అభివృద్ధికి విశాఖ నగర ప్రజలు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బొత్స రాము మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖన సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నారని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరంలో గల సెప్టిక్ ట్యాంకు ఉన్నవారు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పరిశుభ్రత దిశగా 14420 ఫోన్ నెంబర్ కు సంప్రదించి సెప్టిక్ ట్యాంకులను పరిశుభ్రపరచుకోవాల్సిందిగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ ఎన్ వి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, సహాయక వైద్యాధికారి బి ప్రసాదరావు, బయాలజిస్ట్ సాంబమూర్తి, శానిటరీ సూపర్వైజర్ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు, పలువురు నివాసితులు పాల్గొన్నారు.



## ప్రజారక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకం

### పోలీసులకు అభినందన సత్కారం

**భీమవరం ; (జయ జయహే)**

ప్రజారక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసులు నిరంతరం శ్రమిస్తూనే ఉంటారని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో తాడిమళ్ళ వారి కంప్లెక్స్ లో శుక్రవారం ట్రాఫిక్ సిఐ, ఎస్సై, అర్ ఎస్సై, లకు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజారక్షణ, సమాజ పరిరక్షణలో పోలీస్ అందించే సేవలు ఎనలేనివని, ఇటీవల కాలంలో భీమవరం పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తున్నప్పటికీ కొద్దిపాటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రజల సహకరిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. క్లబ్ కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్,కోట్ల నాని, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, చవ్వా శ్రీనివాస సుబ్బారావు మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు సహకరిస్తే సమాజ రక్షణ జరుగుతుందని, సంక్రాంతి పర్వదినాల్లో ప్రతి నిమిషం ట్రాఫిక్ అంతరాయం కలుగుతూనే ఉన్నప్పటికీ ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులు అందించిన సేవలు మరువలేనివని, వంతెన మీద మోటర్ సైకిల్లకు మాత్రమే అనుమతి ఇవ్వడం చాలా మంచి పని అని అభినందించారు. అనంతరం ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్, ఆర్ఎస్సైలు కోనేటి రావు, ఎస్సైలు ఎస్ సత్యసాయి, టివిజి రాజు, సిహెచ్ మురళీకృష్ణ లను సత్కరించారు. కార్యక్రమంలో కార్మురి సత్యనారాయణ మూర్తి,కొత్త శ్రీనివాస్,పరుచూరి నాగేశ్వరావు, కనగర్ల రామకృష్ణ, కనగర్ల కిషోర్, జూలూరి రాజా, బొండాడ మనీష్, కంచర్ల భాస్కరరావు గుప్తా, పులవర్తి రామకృష్ణ, మానేపల్లి రవి చిన్నారావు, తటవర్తినారాయణ, కురిశెట్టి నాని, బొండాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## బాలికలకు అవగాహన కార్యక్రమం

**బుచ్చయ్య పేట జయ జయహే**

బాలికలపై జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరు ఎదుర్కొనే విధంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మలాదేవి అన్నారు బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట. లోపూడి పెద మదీనా అంగన్ వాడి కేంద్రాలలోవడ్డాది కేజీబీవీ బాలికల విద్యాలయంలో శనివారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ నిర్మలా దేవి మాట్లాడుతూ స్థానిక సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు,ఆరోగ్యం,విద్య,సామాజిక ఎదుగుదల, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.బాలికలు విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుంది అన్నారు.బాలికలు విద్యను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించారు జ్యోతి అమ్మాజీ ,భాను, వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకట పద్మ సచివాలయ సిబ్బంది స్కూల్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.



## భరత్ ఇంతేనా నీ రాజకీయ అవగాహన?

### సేవ్ రాజమండ్రి కాదు సేవ్ వైసీపీ చేసుకో : టీడీపీ నాయకుల ఘాటు విమర్శలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి :**

నగర అభివృద్ధి అంశాల్లో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు కనీస రాజకీయ అవగాహన కూడా లేదని నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. గోరక్షణపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.గోరక్షణపేట రోడ్డుపై భూగర్భ పైపులైన్ పనులు పూర్తయిన తర్వాతే రోడ్డు నిర్మాణం జరుగుతుందని, దీనిపై అవగాహన లేకుండా వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సుమారు 15 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ లీకేజీ కారణంగా రూ.3 కోట్లతో పక్కా మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచనలతో 50 ఏళ్ల పాటు నిలిచేలా పనులు జరుగుతున్నాయని చెప్పారు.దశలవారీగా అభివృద్ధి జరుగుతుంటే పబ్లిసిటీ కోసం "సేవ్ రాజమండ్రి" అంటూ హడావిడి చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో రాజమండ్రి సురక్షితంగా ఉందని, బలం కోల్పోయిన వైసీపీని కాపాడుకునేందుకు భరత్ "సేవ్ వైసీపీ" చేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాజమండ్రిలో టీడీపీ జెండానే ఎగిరుతుందని స్పష్టం చేశారు.



## భాష్యం పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

కొవ్వూరు భాష్యం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. కోటేశ్వరీ దేవీ అధ్యక్షత వహించారు. విద్యా, కళలకు అధిదేవత అయిన శ్రీ సరస్వతీ దేవిని పూజిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ పసుపు వస్త్రధారణలో పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు భక్తిగీతాలు, నృత్యాలు, కవితా పఠనాలతో అలరించారు. వసంత పంచమి ప్రాముఖ్యత, భారతీయ సంస్కృతి విలువలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా సృజనాత్మకత, శీలం, శ్రద్ధలతో కూడినదిగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు జి. కోటేశ్వరీ దేవీ తెలిపారు.ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం, నైతిక విలువలు పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



## రాంకీ గ్రూప్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

**కొయ్యురు :(జయ జయహే )న్యూస్ జనవరి 25**

అల్లూరి జిల్లా కాకరపాడు లోని ఏపీఆర్ కాలేజీ మరియు కొయ్యూరు లో ఏపీటిడబ్ల్యుఆర్ బాలికల పాఠశాలలో కొయ్యూరు సిఐ శ్రీనివాస్ ఎస్ఐ కిషోర్ వర్మ రాంకీ గ్రూప్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో దోమ తెరలు, దుప్పట్ల పంపిణీ చేశారు. సిఐ మాట్లాడుతూ విద్యార్థులకు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, కెరీర్ మార్గదర్శనం, మహిళలపై జరుగుతున్న నేరాలు, అలాగే విద్యార్థి జీవితంలో క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం జరిగింది.అనంతరం, ఏపీఆర్ కాలేజీ విద్యార్థులతో కలిసి కాలేజీ ప్రాంగణం నుండి కాకరపాడు జంక్షన్ వరకు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించి, సాధారణ ప్రజలకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో రాంకీ ఫౌండేషన్ కు చెందిన శ్రీకాంత్ గారు మరియు రాంకీ ఫౌండేషన్ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది ఉన్నవ నాగరాజు నియామకం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) ఉపాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది, ఏపీ హైకోర్టు స్టేండింగ్ కౌన్సిల్ (ఎండోమెంట్స్) ఉన్నవ నాగరాజు నియమితులయ్యారు. న్యాయవాదుల భద్రత, వృత్తి భవిష్యత్ కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న "ఆలా" సంస్థలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలా అధ్యక్షులు రాజారామ్ ఎం.వి. ఆదేశాల మేరకు, ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా ఉన్నవ నాగరాజు మాట్లాడుతూ, న్యాయవాదులందరూ ఐక్యంగా కృషి చేసి వృత్తి భద్రతకు, భవిష్యత్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. వరస సంఖ్య 73కు తొలి ప్రాధాన్యత ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో రాజారామ్‌ను గెలిపించాలని ఆయన న్యాయవాదులను కోరారు.ఆలా ఉపాధ్యక్షులుగా నియమితులైన ఉన్నవ నాగరాజుకు ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.




## పెదకోటలో పశువైద్య శిబిరం

**అనంతగిరి: జయ జయహే.**

మండలం లోని పెదకోట పంచాయితీలో పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్ గణేష్ మాట్లాడుతూ, గ్రామంలో పసుపూసకులకు ఎంతో ఉపయోగకరంగా పశు వైద్య శిబిరం నిర్వహించబడినది. ఈ శిబిరంలో పశువుల ఆరోగ్య సమస్యలకు సరైన చికిత్స, పశువుల సంరక్షణ ఆహార నియమాలు వ్యాధి నివారణ పై విలువైన సూచనలు చెప్పారు. ఉచితంగా వైద్య సేవలు అందించడం వల్ల రైతులకు ఆర్థిక భారం తగ్గుతుందని, పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతులు జీవన స్థాయి కూడా మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ శిబిరం ద్వారా రైతుల్లో పశు ఆరోగ్యం పై అవగాహన పెంచుతూ, సీజనల్ లో మూగజీవులకు వచ్చే రోగాలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. పశువుల పట్ల వచ్చే లాభదాయకం కాకుండా వాటి ఆరోగ్యం స్థితి గమనించాలన్నారు. పశువులకు టీకాలు వేసి మందులు ఇచ్చారు. పశువుల వ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పశువులు పెంచడం వల్ల రైతులకు ఎన్నో లాభాలు వస్తాయని, అంతేకాకుండా గవర్నమెంట్ తరఫునుంచి సబ్సిడీ లోన్లు ఇస్తారని, తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్ ఎస్ అన్నపూర్ణాదేవి, పంచాయతీ సెక్రెటరీ విజయ్ కుమార్, పంచాయితీ టిడిపి ప్రెసిడెంట్ కే గణేష్, మాజీ ఎంపీటీసీ ఎస్ కొండబాబు, టిడిపి సీనియర్ నాయకులు డి కృష్ణమూర్తి, ఎన్జీవో సంస్థ ఉద్యోగులు, జై భైరవమూర్తి, జి రామకృష్ణ, జి ఈశ్వరరావు, ఎస్ గంగు నాయుడు, డి సింహాచలం నాయుడు, టిడిపి కార్యకర్త జి వెంకటరమణ, కే కృష్ణమూర్తి, పి దారప్ప, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనే లక్ష్యంగా సమిష్టి కృషి అవసరం





### తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాల్లో 23 పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 201 గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 12,570.056 కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు చెప్పారు. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం కాపుల ఉప్పాడలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థలో, రెవెన్యూ అధికారుల సమక్షంలో అన్ని నిబంధనలు పాటిస్తూ గంజాయిని నిర్వీర్యం చేసినట్లు వివరించారు. జిల్లాలో మాదకద్రవ్యాల హాట్‌స్పాట్‌లను గుర్తించి కఠిన నిఘా ఏర్పాటు చేశామని, పాడుబడిన భవనాలు కూల్చివేయడం, లైటింగ్ ఏర్పాటు, జజుఎ కెమెరాల స్థాపన వంటి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. గంజాయి అలవాటు పడిన 17 మంది నేరస్తులపై ౯ాఌ చీణూా చట్టం కింద చర్యలకు అనుమతి రాగా, 14 మందిని జైలుకు పంపినట్లు చెప్పారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు, డ్రోన్ నిఘా, ప్రత్యేక బృందాల ఏర్పాటు ద్వారా గంజాయి నిర్మూలనకు నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

For a pure tomorrow..
జయహే

# “నేషనల్ సర్వీస్ స్కీమ్ “స్పెషల్ క్యాంప్

### కర్సలిగూడ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎన్ ఎస్ ఎస్ యూనిట్.

**అరకులోయ: జయ జయహే.**



ఏడు రోజుల “నేషనల్ సర్వీస్ స్కీమ్“ స్పెషల్ క్యాంప్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కరస్సలిగూడ అనే గ్రామాన్ని దత్తత తీసుకుని “ఇనాగిరేషన్ ప్రోగ్రాం“ను అరకు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఏపీఎస్ విజయనగరం జోన్ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం ఏదైనా గ్రామం దత్తత తీసుకుని పరిశుభ్రత పాటించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, వన మహోత్సవ మొక్కలు నాటడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన వారికి సహాయం చేయడం, ముఖ్యంగా విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సామాజిక సేవను నాయకత్వ లక్షణాలను పెంపొందించడం. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అరకు ఇంచార్జ్ దొన్నుదొర మాట్లాడుతూ. ఇంటర్మీడియట్ నుండే ఈ ఎన్ఎస్ఎస్ అనేది ఉంటుందని, ఆయన చదివే రోజుల్లో కూడా ఎన్ఎస్ఎస్ లో పాల్గొనేవారని చెప్పడం జరిగింది. వారు చదివే రోజుల్లో వరద బాధితులకు, ముఖ్యంగా కొండ చర్యలు విరిగిపడినప్పుడు ఎన్ఎస్ఎస్ యూనిట్ వాళ్ళు దగ్గరుండి ఆ కార్యక్రమాలను దిగ్విజయం చేయడం జరిగిందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ. ఇది కేవలం ఒక ప్రోగ్రామే కాదని స్వార్థం లేకుండా ఏదైనా సేవను పూనుకొని విజయవంతం చేయడమనేని చెప్పడం జరిగింది. ముఖ్యంగా మీ ప్రొఫైల్ ని బిల్డప్ చేసుకోవడానికి, రాబోయే చదువులో ముఖ్యంగా పీజీ, పిహెచ్.డి వంటి చదువుల్లో,ఉద్యోగం వంటి విషయాలలో రిజర్వేషన్ ఉంటుందని, మెరిట్ లో ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్ కూడా ఉపయోగపడుతుందని చెప్పడం జరిగింది. స్పోర్ట్స్ కోటలో భాగంగా ఎన్ఎస్ఎస్ కూడా కొన్ని ఎగ్జామ్స్ లో ముఖ్యంగా రిజర్వేషన్లు దోహదపడుతుందని చెప్పడం జరిగింది. ఈ వారం రోజులు జరిగేటటువంటి ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి ఈ యూనిట్ కి అన్ని విధాలుగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు వారి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం జరిగింది. స్వచ్ఛందంగా వాలంటీర్స్ అంతా భాగస్వామ్యం అవ్వాలని విద్యార్థులు నాయకత్వ లక్షణాలు సామాజిక స్పృహ కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ చెప్పడం జరిగింది. కోఆర్డినేటర్ కే. బాలరాజు మాట్లాడుతూ కచ్చితంగా సీనియర్స్ నుండి చాలా విషయాలు తెలుసుకొని మా పిల్లల్ని కూడా ఎన్ఎస్ఎస్ లో భాగస్వాములు చేసి గొప్ప వాలంటరీగా తయారుచేసి దేశానికి ఉపయోగపడే విధంగా తయారు చేస్తానని అందరి ముందు మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె శశికుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ పి. నాగబాబు, వై. విజయలక్ష్మి , అనిత, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు కే.ధర్మారావు, డాక్టర్ సిహెచ్.మురళి కృష్ణ,డాక్టర్ బలరాం, పి.వి.వి.ప్రసాద్ .50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థినీలు పాల్గొన్నారు.



## నేలపాలెం రోడ్డు శంకుస్థాపన

### అరకు ఇంచార్జ్ దొన్ను దొర

**అనంతగిరి: జయ జయహే.**

మండలంలో లంగుపర్తి పంచాయితీలో విబి-జి రాం జి గ్రాంట్ ద్వారా మెట్టువలస జంక్షన్ నుండి వెలగలపాడు,వంతెన గరువు,ఎర్ర మెట్టు నేలపాలెం వరకు సుమారు 4 కిలోమీటర్ల రోడ్డు సుమారు 2 కోట్ల రూపాయలతో తారు రోడ్డుకి అరకు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ. స్వాతంత్ర్యం వచ్చి నేటికి ఈ నాలుగు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజన ప్రజలు ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసిందని గత ప్రభుత్వం హయంలో గిరిజన ప్రాంతంలో ఒక్క రోడ్డు కూడా మంజూరుచేయలేదని నేడు రోడ్డు సౌకర్యం లేని గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నా ఘనత కూటమి ప్రభుత్వదేనని తెలిపారు. ఈ నాలుగు గ్రామాల ప్రజలు రోడ్డు ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుత్తే దారుడు పూర్తి బాధ్యతతో నాణ్యమైన రోడ్డు నిర్మాణంచేపట్టాలని నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడవద్దవని సూచించారు గిరిజన ప్రజలకు అభివృద్ధి,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు సోవేరి సుబ్బారావు. అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పాంగి రవీంద్ర. తోపాటు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంచు లక్ష్మి

**శ్రీకాళహస్తి,జయజయహే.**

జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి ప్రముఖ నటి మంచు లక్ష్మీ శనివారం విచ్చేశారు,ఆమెను దక్షిణ గాలిగోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు,దర్శన ఏర్పాటు చేశారు, దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద ఆలయ వేద పండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చందు,ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## ఉషోదయ జూనియర్ కాలేజీలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**చోడవరం జనవరి 24, జయ జయహే**

చోడవరంలో ఉషోదయ జూనియర్ కాలేజ్ లో శనివారం వార్షికోత్సవ వేడుకలను కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ విద్యాసంస్థల చైర్మన్ జె. రమణాజీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. ఉషోదయ జూనియర్ కాలేజ్ విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వంతో తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నృత్యాలు, పాటలు, నాటికలు విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించాయి. చదువుతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల్లో అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు ఉషోదయ యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి,జయజయహే.**

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నందు గ్రీన్ అంబాసిడర్లకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ తోపుడు బండ్లను, స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు,గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సౌకర్యాలు కావాలో గ్రీన్ అంబాసిడర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. మండలంలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపదను చేకూర్చే విధంగా, ప్రభుత్వం స్వచ్ఛ రథం పేరిట నూతన పథకానికి శ్రీకారం చుట్టిందని ,ఈ రథం ద్వారా గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వారి ఇళ్లలోని వస్తువులను ఈ రథంలోని వ్యక్తులకు చేరిస్తే ఆ వస్తువులు ఎంత విలువ ఉంటుందో, అంత విలువకు తగ్గ నిత్యవసర సరుకులను గ్రామస్తులు స్వీకరించవచ్చుని అన్నారు,గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ స్వచ్ ఆంధ్ర రథం ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు రావెళ్ల మునిరాజా నాయుడు,మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్,మండల నాయకులు అధికారులు పాల్గొన్నారు.





## జిల్లా వైఎస్సార్సీపీ కల్చరల్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా శివకుమార్

### మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిసిన శివకుమార్

**శ్రీకాళహస్తి,జయజయహే.**

శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన టి శివకుమార్ ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కల్చరల్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం నుంచి నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు ఇంత పెద్ద పదవి రావడానికి కారకులైన బియ్యపు మధుసూదన్ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో జిల్లా స్థాయి పదవి రావడానికి కారకులైన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు భూమన్ కరుణాకర్ రెడ్డి,తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి,రష్ ఆసుపత్రి అధినేత,ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యములకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను కలిసి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయం పాలకమండలి మాజీ సభ్యులు బుల్లెట్ జయశ్యామ్ రాయల్,సాధన మున్నా రాయల్,ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డైరెక్టర్ మహదేవ్,రాము ఉన్నారు.

# బాలికలు చట్టాలు తెలుసుకోవాలి

**అగనంపూడి (జయ జయహే)**

అగనంపూడి జూనియర్ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవం హ్యూమన్ రైట్స్ సెల్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జే యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు కార్యక్రమంలో ముఖ్య అతిథి జాతీయ హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షులు కుప్పిలి రామకృష్ణ మాట్లాడుతూ బాలికలు తమ బాధ్యతను గుర్తించి విద్య పట్ల క్యారియర్ పట్ల శ్రద్ధ వహించాలని తమను తప్పుదోవ పట్టించే అంశాలు వ్యక్తులు పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగం అవసరం మేరకు వినియోగించాలని తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయులు పట్ల గౌరవం కలిగి ఉండాలని అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గాజువాక అధ్యక్షులు బి యశోదర వేద మణి మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షతన రూపు మాపడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు చేస్తున్నాయని వాటిని ప్రతి బాలిక తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వివిధ రకాల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఏపీ ఈపీడీసీఎల్ ఏ డి ఈ ఏ ప్రసన్న రాణి అగనంపూడి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణవేణి ఏ డి సి చైర్మన్




బలిరెడ్డి సత్యనారాయణ శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కే పద్మావతి మరియు జి రాధా కుమారి కే కీర్తి పట్నాయక్ కి సన్మానించి అందజేశారు మరియు వివిధ పాఠశాల ఉత్తమ బాలికలకు ప్రశాంత పత్రాలు జ్ఞాపికలు హ్యూమన్ రైట్స్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ ఎన్ రాజు సభ్యులు అంగుళురి ఈశ్వరరావు విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ కె వి సత్యనారాయణ మరియు లెక్చరర్స్ విద్యార్థులు పాల్గొన్నారు



## బాలికల భవిష్యత్తుకు భరోసాగా ‘ఉషోదయ ఫౌండేషన్‘

### అంగన్‌వాడీ కేంద్రంలో విద్యా సామగ్రి పంపిణీ

**శ్రీకాళహస్తి,జయజయహే.**

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి పట్టణంలోని నాగార్చిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధినేత్రి చక్రాల ఉష ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి,వారికి తీపి పదార్థాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికల ప్రాథమిక విద్యా ప్రోత్సాహంలో భాగంగా వారికి పలకలు,బలపాలను వితరణ చేశారు. అంగన్‌వాడీ స్థాయి నుంచే పిల్లల్లో అక్షరాస్యత పట్ల ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతో పలకలు,బలపాలు పంపిణీ చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా శ్రీకాళహస్తి ప్రాంతంలోని అణగారిన వర్గాలకు అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్కే రేష్మా, ఎన్. సుభాషిణి, సహాయకురాలు కె.సుప్రజ, ఉషోదయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి అధికారులు తీరు..
# మంత్రి సంధ్యారాణి మండిపాటు





### ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా అధికారుల వ్యవహారం

### శంబర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సంధ్యారాణి

**మక్కువ, జనవరి 24,(జయజయహే):-**

రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారుల పని తీరు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉందని రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆర్ అండ్ బి అధికారులు తీరిపై జిల్లా కలెక్టర్ ముందు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా మక్కువ - సాలూరు రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని చెప్పిన పట్టించుకోవడం లేదు. మీరు వెళ్లేటప్పుడు మక్కువ - సాలూరు రోడ్డు మీదగా వెళితే రోడ్డు పరిస్థితి మీకే తెలుస్తుందని రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్ ముందు వాపోయారు. శనివారం నాడు జిల్లా కలెక్టర్ ఎం ప్రభాకర్ రెడ్డి తో పాటు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం నుండి జరగనున్న శంబర శ్రీ పాలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చదురు గుడి, వనం గుడి ప్రయాంగణంలో ఏర్పాట్లును స్వయంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు అందించారు. జాతర సందర్భంగా పారిశుధ్య , తాగునీటి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ప్రదేశంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశంలో ఆరు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆలయ కార్య నిర్వహణ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. ప్రతి చోట బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్లకు రుసుం వసూళ్లు చేయాలని డిపిఓ కొండలరావుకి కలెక్టర్ ఆదేశించారు. చదురు గుడి నుండి వనం గుడి వరకు కాలినడకనే నడిచి సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతరకు కేవలం రెండు రోజుల గడువు ఉన్నందున ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర సందర్భంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ సాలూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణను కలెక్టర్ తో పాటు మంత్రి గుమ్మడి సంధ్యారాణి అడిగి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వనం గుడిలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి తో పాటు జిల్లా కలెక్టర్ ఎం ప్రభాకర్ రెడ్డి శ్రీ పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. చక్కగా ఉన్న దేవాలయంను పునర్మించడం ఎందుకంటూ మంత్రి సంధ్యారాణి కలెక్టర్ ముందు ప్రస్తావించారు. దేవాలయం పునర్ నిర్మాణం చేపడితే శ్రీ పోలమాంబ అమ్మవారి విగ్రహం స్వరూపం మారిపోయే అవకాశం ఉంటుందని ఆమె ఈ సందర్భంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న చైర్మన్ నైదాన తిరుపతి రావు ను మంత్రి గుమ్మడి సంధ్యారాణి పొగడ్తలతో ముంచారు. గతంలో చైర్మన్లు హుండీలు కోసం చూసేవారు. ఇప్పుడు మా చైర్మన్ తమ స్వంత డబ్బులు వెచ్చిస్తూరని ఆమె చైర్మన్ ఉద్దేశించి కలెక్టర్ ముందు ప్రస్తావించడం విశేషం.! అనంతరం గ్రామంలో సిరిమను తిరిగే ప్రదేశాలను పరిశీలించారు. సిరిమను తిరిగే రోడ్లన్నీ నీటితో శుభ్రం చేసి ఆరు రంగులతో డిజైన్ వేయాలని ఆదేశించారు. జాతర సందర్భంగా ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసే విధంగా తెలియపరుస్తూ దండోరా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , మంత్రి సంధ్యారాణి వెంట జాతర ఇంచార్జ్ ఇంచార్జ్ , పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి, ఏ ఎస్ పి మనీషా వంగనపూడి, సాలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మక్కువ ఎస్సై, ఎం వెంకటరమణ లతో తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతరకి సర్వం సిద్ధం

### మేడారం విధుల్లో 42 వేల మంది...

### మహా జాతరకు అందుబాటులో డిజిటల్ సేవలు...

### ఏ ఐ సేవలను ఉపయోగిస్తున్న పోలీస్ శాఖ

### మహాజాతరకు ఆర్టీసీ సన్నద్ధం

**జయ జయహే**

ఆసియా ఖండంలోనే ఆదివాసీల అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక సమ్మక్క సారక్క జాతరకు సర్వం సిద్ధమైంది. ఈనెల 28 నుంచి 31 వరకు మహా వేడుకకు అమ్మవార్ల గద్దెలు సుందరంగా ముస్తాబయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఏర్పాట్లు చేసింది. గతంలో సుమారు రెండు కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోగా, ఈ సారి మూడు కోట్ల మందికి పైగా తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్లు కేటాయించి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ ద్వారా జాతరలో గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించింది. వందేళ్లు ఉండేలా.. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయలు ఉట్టిపడేలా రాతి కట్టడాలపై వివిధ మూర్తుల ఆకృతులను చెక్కారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలిరానున్నారు.

**సారలమ్మ రాకతో..**

ఈనెల 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి పూజారులు సారలమ్మను, కొండాయి నుంచి గోవిందరాజు, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును గద్దెపైకి తీసుకురావడంతో జాతర ఆరంభమవుతుంది. 29న సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెలపైకి రావడంతో మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభమవుతుంది. ఈనెల 30న వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 31న సాయంత్రం సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవిందరాజు, పగిడిద్దరాజు వనదేవతలు వనప్రవేశం తో జాతర ముగియనుంది.

**విధుల్లో 42 వేల మంది..**

మేడారం జాతర నిర్వహణలో మొత్తం 42,027 మంది విధులు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల్లోనే 30,904 మంది అధికారులు, సిబ్బంది సేవలు అందించనున్నారు. 49



రహదారుల్లో మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టగా.. కొత్తగా 10 రోడ్లు, మూడు ప్రదేశాల్లో కల్వర్టులు నిర్మించారు. వాహనాల నియంత్రణ కోసం ఏకదశ, ద్విదశ రూట్లను స్పష్టంగా గుర్తించి ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ అవసరాల కోసం 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాలను కేటాయించారు.

**202 కోట్లతో అభివృద్ధి పనులు..**

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.202.7కోట్ల వ్యయంతో మేడారం జాతర కోసం పనులు చేపట్టారు. వనదేవతల గద్దెల పునర్నిర్మాణం, నాలుగు లేన్ల రోడ్ల అభివృద్ధి, ప్రధాన జంక్షన్ల సుందరీకరణ, హెలిప్యాడ్ల మరమ్మతులు వంటి కీలక పనులు పూర్తి చేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.53.21 కోట్ల వ్యయంతో 84 పనులు చేపట్టారు. జాతరలో పారిశుద్ధ్య నిర్వహణకు 5,700 మరుగుదొడ్లు, 285 టాయిలెట్ బ్లాకులు సిద్ధం చేస్తున్నారు. కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది


# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి,జయజయహే.**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'స్వర్ణాంధ్ర ఉ స్వచ్ఛ దివస్'లో భాగంగా శ్రీకాళహస్తి దేవస్థానం పరిసర ప్రాంతం నందు స్వత్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురపాలక సంఘం అధికారులు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్ నాయకులు ప్రజలచే స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూటమి నాయకులు అధికారులతో కలిసి సువర్ణముఖి నది పరిసర ప్రాంతాల వద్ద శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు,స్వర్ణముఖి నది పరిసరప్రాంతాలవద్ద ఉన్న



పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించడం,పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛంద స్వర్ణాంధ్ర వాహనాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి లంచనంగా ప్రారంభించారు.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ స్వత్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నగిరి నియోజకవర్గంలో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారని ,ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ,శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా రూపొందించడానికి ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన రాష్ట్ర నిర్మాణానికి కృషిచేసి దేశంలోనే మన రాష్ట్రం స్వచ్ఛ ఆంధ్రలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు టీడీపీ మండల అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు,మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీరంగపట్నంలో ఆలయాల అభివృద్ధికి కంబాల 3.50 లక్షలు విరాళం

### హరిచంద్ర నాటకం కళాకారులకు 50 వేలు ఆర్థిక సహాయం

**గోకవరం జయ జయ హేప్రతినిధి**

కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలోని పలు ఆలయాల అభివృద్ధికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు శనివారం 3 లక్షల 50 వేలు రూపాయలు విరాళం అందించారు. శ్రీరంగపట్నం గ్రామంలో రామాలయం కళ్యాణ మండపానికి 5 లక్షలు విరాళం ప్రకటించారు. గతంలో 3 లక్షలు రూపాయలు విరాళం అందజేశారు. మిగిలిన రెండు లక్షలు రూపాయల విరాళం శనివారం సీఎండీ కార్యాలయం వద్ద కమిటీ సభ్యులకు చెక్ ను అందించారు. అలాగే గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి 1.50 లక్షలు రూపాయలు విరాళం ప్రకటించారు. గతంలో లక్ష రూపాయలు విరాళం అందజేశారు. మిగత 50 వేలు రూపాయలు విరాళం సీఎండీ కార్యాలయం వద్ద కమిటీ సభ్యులకు చెక్ ను అందిచారు. అలాగే లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని, గ్రామ మహిళలు కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి కోరారు. స్పందించిన ఆయన లక్ష రూపాయలు చెక్ ను మహిళా కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా సంక్రాంతి సందర్భంగా శ్రీరంగపట్నం గ్రామంలో శివాలయం వద్ద హరిచంద్ర నాటకం వేసిన పదిమంది కళాకారులకి ఒక్కొక్కరికి ఐదువేలు రూపాయలు చొప్పున 50 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శివ, అప్పలరాజు, చిన్నారి, సత్తిబాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్న కొండపై ఘనంగా లక్ష తులసి పూజ

**గోకవరం జయ జయ హేప్రతినిధి**

బ్రహ్మోత్సవాలలో భాగంగా గోకవరం మండలం తంటికొండ వెంకటగిరి పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఘనంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచరణల నడుమ ఆలయ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర సువర్ణ తులసి దంపతులు చేతుల మీదుగా లక్ష తులసి పూజతో పాటు వివిధ పవిత్ర నదుల జలాలతోస్వామివారికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. కొండపై గోపూజలు నిర్వహించారు. ఉదయం తెల్లవారుజామునండి స్వామివారికి విశిష్ట పూజలు ప్రారంభమైనవి. స్వామివారికి విశ్వక్షేన పూజ,పుణ్యాహవచనం, చతుర్దశ కళశారాధన ,పంచామృత మండపారాధన ,కుంభ పూజ, మూర్తి ఆవాహన శ్రీవారు స్వామికి అభిషేకము , కుంకుమార్చన నిత్యోపాసన, మహాశాంతి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర హోమము, శ్రీ స్వామివారి మంత్రపుష్పముల పూజలు ఘనంగా పూజలు జరిగినవి. ఆలయ కార్య నిర్వహణ అధికారి చల్లా ఉదయ బాబు నాయుడు, ఆలయ గుమస్తా చిన్ని, ఆలయ కమిటీ అభివృద్ధి డైరెక్టర్లు బొ ట్ట రామకృష్ణ, చింతల నాగు, చప్పిడి పెంటరాజు,సుంకర వీరమణి చంటి, మల్లా అమ్మాజీ రమణ , ఏగి దుర్గాదేవి సాంబశివరావు భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.




## బాలికల పట్ల వివక్షత తొలగించేందుకే బాలిక దినోత్సవం

**చోడవరం జనవరి 24, జయ జయహే**

జాతీయ బాలికల దినోత్సవం శనివారం స్థానిక పి ఎస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్వైజర్ బి శాంతిప్రియ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎదిగే హక్కు బాలుడుతో పాటు బాలికకు కూడా సమానంగా ఉండాలని, దేశవ్యాప్తంగా బాలికల పట్ల కొనసాగుతున్న వివక్షతను తొలగించి వారి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా 2009 నుండి ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదీన జాతీయ బాలిక దినోత్సవం కేంద్ర మహిళా మహిళా అభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుపుకుంటున్నారని చెప్పారు. అలాగే బాలికల హక్కులపై అవగాహన కల్పించడం బాలికల విద్య ఆరోగ్యం పౌష్టికాహారం వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి లక్ష్యాలు గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు, వాటి వలన జరిగా అనర్థాలు కోసం కూడా వివరించడంతోపాటు పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మల్లికార్జున రావు , అంగన్వాడీ కార్యకర్తలు, సి .హెచ్. ఓ ఏ.ఎన్.ఎం పాల్గొన్నారు.

# ట్రైబల్ మార్కెట్ ఏర్పాటు చేయాలి





**రోడ్లపైనే అటవీ ఉత్పత్తుల విక్రయాలు**

**వారపు సంతల్లో అటవీ ఉత్పత్తులు**

**అమ్ముకోవటానికి సరైన వేదిక లేదు**

**ఎండల్లో రోడ్లపైనే మా బతుకులు**

**స్పందించండి సార్లు**

**మారేడుమిల్లి ,ఏజెన్సీ ప్రత్యేక ప్రతినిధి(జయజయహే):**

మారేడుమిల్లిలో ప్రత్యేక ట్రైబల్ మార్కెట్ (గిరిజన సంత) ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. పోలవరం జిల్లాలోని మారేడుమిల్లి ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదిగినప్పటికీ, స్థానిక గిరిజనులకు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి సరైన వేదిక లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని గిరిజనులు వాపోతున్నారు.

**మధ్యవర్తుల బెడద నివారణ:**

ప్రస్తుతం గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులను చింతపండు, కరక్కాయలు, తేనె ,చీపుర్లు, సిక్కాయ ,చిరుధాన్యాలు వంటి తదితర ఉత్పత్తులను తక్కువ ధరకే మధ్యవర్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేక మార్కెట్ ఉంటే పర్యాటకులకు నేరుగా అమ్ముకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు .

**శాశ్వత ప్రాంగణం :**

వారం వారం జరిగే సంతల కోసం రోడ్ల పక్కన వేచి చూడకుండా, ఒక నిర్ణీత ప్రాంతంలో షెడ్లు, తాగునీరు , కనీస వసతులతో కూడిన మార్కెట్ కావాలని వారు కోరుతున్నారు.సరైన సదుపాయం లేక రోడ్లపైనే ఎండల్లో అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్గానిక్ బ్రాండింగ్:**

మారేడుమిల్లి వచ్చే పర్యాటకులు స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తుల కోసం వెతుకుతుంటారు. అలాంటి వారి కోసం ఒక ప్రత్యేక మార్కెట్ ఉంటే, అందులో అన్నిరకాల వస్తువుల. ఉంటాయి . వీటికి "ట్రైబల్ బ్రాండ్" అనే గుర్తింపు లభిస్తుందని చెబుతున్నారు.

**ఆదాయ వనరులు:**

పర్యాటక రంగం ద్వారా వచ్చే లాభం కేవలం హోటళ్ళు, రిసార్టులకే కాకుండా, సామాన్య గిరిజన కుటుంబాలకు కూడా చేరాలని వారు ఆశిస్తున్నారు.ఆ దిశగా చర్యలు చేపడితే గిరిజన కుటుంబాలు ఆర్థికంగా ఎదగటానికి అవకాశం ఉందని చెబుతున్నారు.

**దీని వల్ల కలిగే ప్రయోజనాలు**

స్థానిక ఉపాధి: గిరిజన మహిళా సంఘాలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి మంచి వేదిక దొరుకుతుంది.ఒకే వేదికలో అన్నిరకాల ట్రైబల్ ఉత్పత్తులు ప్రదర్శించవచ్చునని స్థానిక గిరిజనులు అంటున్నారు.

పర్యాటక ఆకర్షణ: పర్యాటకులకు గిరిజన సంస్కృతి, వారి ఆహారపు అలవాట్లు మరియు హస్తకళలను ఒకే చోట చూసే అవకాశం కలుగుతుంది.

గిట్టుబాటు ధర: ఐటిడిఎ ద్వారా ఈ మార్కెట్‌ను పర్యవేక్షిస్తే, గిరిజనులకు సరైన ధర లభించే అవకాశం ఉంటుంది.మారేడుమిల్లి ప్రాంతంలో ఇప్పటికే ఐటిడిఎ ఆధ్వర్యంలో కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, అది పూర్తిస్థాయిలో ఒక "ట్రైబల్ హబ్"గా మారాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకొని మా గిరిజన కుటుంబాల బ్రతుకులను ఆదుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.





# వైభవంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి
# ఆలయ నిర్మాణ బ్రోచర్ ఆవిష్కరణ





**అనకాపల్లి, జనవరి 24:(జయ జయహే)**

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా, లోక కళ్యాణార్థం శ్రీ వేద సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన "శ్రీ మంత్రిణి దండనాథ సహిత శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం" నిర్మాణ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 5 గంటలకు అత్యంత వైభవంగా జరిగింది.

ఈ శుభ తరుణంలో ట్రస్ట్ చైర్మన్ పసరకొండ వేంకట మల్లేశ్వర కిరణ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ నిర్మాణ ఆశయాలను, రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. మన సనాతన ధర్మాన్ని, వేద సంస్కృతిని కాపాడుతూ, భవిష్యత్ తరాలకు అందించడమే ఈ ఆలయ నిర్మాణ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనకాపల్లి భక్తులందరూ ఈ బృహత్తర కార్యంలో పాలుపంచుకుని, ఆలయ నిర్మాణానికి సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు పాల్గొని ఆలయ నిర్మాణానికి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్: పసరకొండ వేంకట మల్లేశ్వర కిరణ్

**ముఖ్య అతిథులు మరియు ట్రస్ట్ సభ్యులు:**

కొమ్మాలపల్లి నందన శర్మ, కప్పగంతుల సాయి మురళి శర్మ,భవ్యశ్రీ దేవోలాపర్స్అధినేత కంద్రేగుల నాయుడు జయహే తెలుగు దినపత్రిక ఎం డి పెద్దింటి సురేష్ , చెన్నాప్రగడ భానుగోపాల్, కోమటి వేంకటేష్ (ప్రముఖ వ్యాపారవేత్త) వైద్య ప్రముఖులు డా. నటరాజన్ కార్తీక్, డా. వై.వి. రమణారావు శృంగవరపు శ్రీకాళహస్తి పాపయ్య శాస్త్రి శీలం నదియా వైస్సార్సీపీ మండల మహిళా ఉపాధ్యక్షురాలు ఇతర సభ్యులు మరియు భక్తులు:రేపాక శ్రీ రామకృష్ణ శ్రీకాళహస్తి, పైన జానకిరామ్, ఆవుపాటి త్రినాథ్, చిట్టి బోయిన కోటేశ్వరరావు, పసరకొండ లక్ష్మీ తులసి, ఆడారి హేమ, శీలం సూరి అప్పారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వేద మంత్రోచ్ఛారణలతో, మంగళ వాయిద్యాలతో అత్యంత కన్నుల పండుగగా, భక్తి భావంతో సాగింది.









## పాస్టర్స్ అండ్ లీడర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మాజీ మంత్రి అమర్నాథ్. కె కె రాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

ఉత్తర నియోజకవర్గం 46వార్డ్ కైలసపురంలో గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విక్టర్ పాల్ సమక్షంలో "పాస్టర్స్ అండ్ లీడర్స్ కాన్ఫరెన్స్ - ఉత్తరాంధ్ర ఆత్మీయ ఐక్యతకు ప్రతీక" సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ , విశాఖ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కె.కె. రాజు, బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అండ్ లీడర్స్ ప్రార్ధన చేసి మేము ఎల్లపుడు వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి వైస్ జగన్ మోహన్ రెడ్డి కి, మా తరపున మేము సంగిభావం తెలుపుతున్నాము అని అన్నారు.వచ్చే ఎన్నికల్లోక్రైస్తవులు అందరూ వైస్సార్సీపీ అధికారం లోకి రావడానికి అందరూ సమిష్టిగా చేయాలని కోరారుఈ కార్యక్రమం లో 46 వ వార్డ్ కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు,వార్డు అధ్యక్షులు బలిరెడ్డి గోవింద్, దూది నర్సింగరావు కె ఈశ్వరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు



## స్వధర్మంలోకి పునః ప్రవేశించిన ఆ కుటుంబాలు

**మాడుగుల జనవరి 24 జయ జయహే**

మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీ చిన్న పిట్టగడ్డ గ్రామానికి చెందిన ఆరు కుటుంబాల వారు తిరిగి స్వధర్మం లోకి చేరారు. తమ స్వ నిర్ణయంతో తమ ధర్మాన్ని తిరిగి చేపట్టామని భవిష్యత్తులో మరోసారి పొరపాటు చేయబమని ఈ సందర్భంగా ఆ కుటుంబాల వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ గ్రామంలో ఉన్న 23 కుటుంబలులో ఆరు కుటుంబాలు పరమతం చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ రక్ష వేదిక ఆధ్వర్యంలో సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా ప్రచారక తవ్వ సన్యాసి శెట్టి, గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తి సంఘం సీఈవో వడ్డీ రాజ్ కుమార్ ప్రోత్సాహంతో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని సుధర్మాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వారందరికీ వస్త్రాలు రగ్గులు పంపిణీ చేసి స్వధర్మ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని పరమతాల పట్ల మోజు పడవద్దు అని విజ్ఞప్తి చేశారు.




## స్వచ్ఛ రథాన్ని సద్వినియోగ పరుచుకోండి

**మాడుగుల జనవరి 24,జయ జయ హే**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాన్ని ప్రజలందరూ సద్వినియోగపరచుకొని ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బండా సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాడుగుల మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తడి చెత్త పొడి చెత్త సేకరణ కార్యక్రమం గ్రామాలలో జరుగుతుందని, వాటి ద్వారా సంపద తయారు చేస్తున్నారని చెప్పారు. అలాగే ఇంట్లో గల పనికిరాని ప్లాస్టిక్ వస్తువులను ఈ రథం వద్ద అందజేస్తే మరి ఇంటికి అవసరమైన వస్తువులు అందజేస్తారని చెప్పారు. ఈ రథం మండలంలో గల అన్ని గ్రామాల్లో పర్యటిస్తాదని మేజర్ పంచాయతీల్లో వీధి వీధినా తిరుగుతాదని కాబట్టి ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఎండిఓ కే అప్పారావు మాట్లాడుతూ ప్రతిరోజు ఈ రథం ఘాటి రోడ్డు జంక్షన్ నుంచి నిర్దేశించిన గ్రామాలకు వెళ్తాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారాం, ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, టిడిపి నాయకులు ఎన్ సన్యాసిరావు, పుప్పాల రమేష్, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, పుప్పాల లక్ష్మీనారాయణ, సహకార సంఘ అధ్యక్షుడు కొట్నాల త్రినాధరావు, కే నానాజీ, ఎల్ కాశిబాబు, ఎం ఈశ్వరరావు, పలువురు నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## సారా బట్టిలపై ఎక్సైజ్ దాడులు

**చోడవరం జనవరి 24 జయ జయహే**



చోడవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ కె.వి పాపునాయుడు ఆధ్వర్యంలో శనివారం నాటు సారాయి తయారీ స్థావరంపై దాడులు చేశారు.కె. కోటపాడు మండలంలోని ఆర్ వై అగ్రహారం గ్రామ సరిహద్దుల్లో గుర్తించిన సారాయి బట్టీలను, 600 లీటర్ల పులిసిన బెల్లపు ఉటలను ధ్వంసం చేశారు. నాటు సారాయి తయారీదారులు అగ్రహారం గ్రామానికి చెందినవారిగా ప్రాధమికంగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. నాటు సారాయి తయారీదారులను, వారికి బెల్లం అమ్మోనీయ సప్లై చేసిన వర్తకులను పట్టుకొని వారిపైన కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎస్సై ఎమ్ శేఖరం, ఎమ్ అప్పలనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com